క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ

దహెగాం: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ ఎఫ్ చెక్కులను సోమవారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో జెడ్పీటీసీ తాళ్లపల్లి రామారావు పంపిణీ చేశారు. మండల కేంద్రానికి చెందిన మల్లేశ్ రూ.17 వేలు, చినగుడిపేటకు చెందిన లావణ్యకు రూ.60వేలు, ఎస్.రమేశ్‌కు రూ.18 వేలు, జనార్దన్‌కు రూ.13వేలు, పీపీరావు కాలనీకి చెందిన వెంకటేశ్‌కు రూ. 60వేల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రసాద్‌రాజు, నాయకులు పుప్పాల సంతోష్, ప్రకాష్ పాల్గొన్నారు.

గుండెపోటుతో ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ మృతి



వినోద్‌కుమార్ (ఫైల్)

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్ క్వార్టర్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న వినోద్‌కుమార్ సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే 1996 బ్యాచ్‌కు చెందిన వినోద్‌కుమార్ (52) కొంత కాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. ఈక్రమంలో ఆదివారం రాత్రి గుండెపోటు రాగా ఆసుపత్రికి తీసుకెళ్తున్న సమయంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ సురేశ్‌కుమార్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. తక్షణ సాయం కింద కుటుంబ సభ్యులకు అంత్యక్రియల నిమిత్తం రూ.20వేలను పోలీసు అధికారులతో పంపించారు.

'స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి'

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రధాన రహదారి రాజీవ్ గాంధీ చౌరస్తా నుంచి తెలుగుతల్లి విగ్రహం (ఎన్టీఆర్‌చౌక్) వరకు ఇటీవల నిర్మించిన ప్రధాన బీటీ రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని మజిలీస్ బచావో తెహరిక్ (ఎంబీటీ) జిల్లా నాయకుడు షేక్ సలీం కోరారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ అంజయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ ప్రాంతంలో రోడ్డుపై ఎలాంటి స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.

అగర్‌గూడలో బోనాలు



లక్ష్మీదేవర బోనాలతో మహిళలు

పెంచికల్‌పేట్: మండలంలోని అగర్‌గూడ గ్రామంలోని లక్ష్మీదేవర ఆలయంలో బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో బోనాలు వండి ఆలయం చుట్టూ డప్పుచప్పుళ్లతో ప్రదక్షిణలు చేశారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు ఆలయంలోని విగ్రహాలకు అభిషేకం చేశారు. పోతురాజుల విన్యాసాలు, అమ్మవార్ల ఊరేగింపుతో గ్రామంలో సందడి నెలకొంది. ఆలయంలో ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

కలప చెట్లు మాయం



గొడ్డలి వేటుకు గురైన కలప చెట్టు

బెజ్జూర్: బెజ్జూర్ రేంజ్ పరిధిలోని ఎల్లారం పోచమ్మ బీట్‌లో దాదాపు 12 టేకు చెట్లు గొడ్డలి వేటుకు గురయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తులు కలప చెట్లను మాయం చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయంపై రేంజ్ అధికారి దయాకర్‌ను సంప్రదించగా విచారణ కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. కలపను అక్రమంగా తరలించిన బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

వేధిస్తే సమాచారం ఇవ్వాలి

ఆదిలాబాద్‌టౌన్: మహిళలను వేధిస్తే సఖీ కేంద్రానికి సమాచారం ఇవ్వాలని సఖీ కౌన్సిలర్ నాగమణి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని శాంతినగర్, గణేష్‌నగర్, రవీంద్రనగర్ కాలనీల్లో జనశిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టైలరింగ్, బ్యూటీషియన్ శిక్షణ శిబిరాల్లో అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ యువతులను, బాలికలను, మహిళలను వేధింపులకు గురిచేస్తే 181, డయల్ 100లకు సమాచారం ఇవ్వాలన్నారు. కౌన్సెలింగ్, న్యాయ, వైద్య, పోలీసు సహాయంతో పాటు తాత్కాలిక వసతి కల్పించడం జరుగుతుందన్నారు.

'వారధి' అందుబాటులోకి వచ్చేనా..?

- సింగరేణి ఆధ్వర్యంలో ఇనుపకడ్డీలతో ఏర్పాటు చేస్తున్న బ్రిడ్జి
- పాముడుగు(వాగు)పై నిర్మాణం
- జిల్లా కేంద్రానికి తగ్గనున్న దూరభారం
- ఎనిమిది నెలలుగా కొనసాగుతున్న పనులు



పాముడుగు వాగుపై అసంపూర్తిగా దర్శనమిస్తున్న ఇనుప కడ్డీల బ్రిడ్జి

తిర్యాణి: సింగరేణి ప్రభావితమైన మండలంలో దాదాపు 100మందికి పైగా కార్మికులు కైరిగూడ ఓసీ పరిధిలోని ప్రైవేటు కంపెనీల వద్ద కాంట్రాక్టు పద్ధతిన విధులు నిర్వహిస్తుంటారు. మండలం నుంచి నిత్యం కై రిగూడకు వెళ్లాల్సిన ప్రధాన రహదారిపై పాముడుగు వాగు ఉండడంతో వర్షాకాలంలో ఇక్కడి కార్మికులు విధులకు వెళ్లేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. వీటితో పాటు నిత్యం పదుల సంఖ్యలో ఈ దారిలోనే జిల్లా కేంద్రానికి ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో వాగు కష్టాలకు చెక్ పెట్టేందుకు గ్రామపంచాయతీ విజ్ఞప్తి మేరకు ఎనిమిది నెలల క్రితం సరికొత్త వారధికి సింగరేణి సంస్థ శ్రీకారం చుట్టింది. కానీ నేటికీ నిర్మాణ పనులు అసంపూర్తిగానే ఉండటంతో వర్షాలు పడేలోపు పనులు పూర్తవుతాయా..? లేదా..? అన్న ప్రశ్న తలెత్తుతోంది.

వర్షాలు కురవకముందే..

గడలపెల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పాముడుగు (వాగు)పై సింగరేణి సంస్థ తన సొంత నిధులతో తక్కువ బడ్జెట్‌తో ఎక్కువ కాలం మన్నిక ఉండేందుకు ఇనుప కడ్డీలతో బ్రిడ్జి నిర్మాణం చేపట్టింది. ఎనిమిది నెలల క్రితం బ్రిడ్జి నిర్మాణ పనులను సింగరేణి సంస్థ ప్రారంభించింది. ఇనుప కడ్డీలను ఏర్పాటు చేసినా రెండు పక్కల ప్లాట్‌ఫారం పూర్తికాకపోవడంతో నేటికీ అసంపూర్తిగానే దర్శనమిస్తుంది. వర్షాలు కురవకముందే పనులు పూర్తయితే అక్కడి గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఈ వంతెన నిర్మాణం పూర్తవడం ద్వారా మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లే దూరభారం దాదాపు 10కిలోమీటర్ల మేర తగ్గుతుంది. వీటితో పాటు నిత్యం ఓసీలల్లో విధులను నిర్వహించేందుకు వెళ్లే కార్మికులకు ఈ వంతెన ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది. వర్షాకాలంలో ఈ దారిలో వెళ్లలేక కార్మికులు 10 కిలోమీటర్లు అధికంగా తిరిగి వెళ్లాల్సిన పరిస్థితికి వర్షాకాలంలోనైనా చెక్ పడుతుందో? వేచి చూడాల్సి ఉంది.

వారం రోజుల్లో పూర్తి చేస్తాం



సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న ఇనుప కడ్డీల బ్రిడ్జి పనులు దాదాపు పూర్తయ్యాయి. రెండు పక్కల ప్లాట్‌ఫారం నిర్మిస్తే రాకపోకలు సాగించేందుకు అందుబాటులోకి వస్తుంది. వారం రోజుల్లో నిర్మాణ పనులు పూర్తయ్యేలా అన్ని చర్యలు చేపడుతాం.
.– మడావి గుణవంత్‌రావు, సర్పంచ్, గడలపెల్లి

గ్రామగ్రామాన ఘనంగా హరితోత్సవం



కాగజ్‌నగర్‌టౌన్: పాల్గొన్న అధికారులు, సిబ్బంది



కౌటాల: గురుడుపేటలో..



దహెగాం: మొక్కలు నాటుతున్న జెడ్పీటీసీ రామారావు

దహెగాం: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామ పంచాయతీలలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం హరితోత్సవం నిర్వహించారు. మండలంలోని కల్వాడ గ్రామంలో జెడ్పీటీసీ తాళ్లపల్లి రామారావు పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరితహారం కింద ప్రతీ గ్రామంలో మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చన్నారు. హరితహారంలో మొక్కలు నాటడం ద్వారా అడవుల విస్తీర్ణం పెరిగిందన్నారు. ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కౌటాలలో..

కౌటాల: పచ్చదనంతోనే ఆరోగ్యం చేకూరుతుందని ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని ఆయా గ్రామాల్లో హరితోత్సవం కార్యక్రమం నిర్వహించారు. కౌటాల మెగాపార్కులో ఆయన మొక్కలు నాటారు. గురుడుపేట, ముత్తంపేట, సాండ్‌గాం, కన్నెపల్లి, గుడ్లబోరి, వీర్దండి, తలోడి గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు మొక్కలు నాటారు. సీఐ సాధిక్‌పాషా, ఎంపీవో మౌనిక, ఏపీవో పూర్ణిమ, సర్పంచులు సునంద, శ్రీనివాస్, రమేశ్, రాందాస్, దామోదర్, రేణుక, శంకరమ్మ, కార్యదర్శులు సాయికృష్ణ, గణేష్, భాస్కర్, తిరుపతి, సునీత, తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌లో..

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలో తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం హరితఉత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎస్సీ బాలికల వసతి గృహంలో సంస్థ ఆధ్వర్యంలో హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించి పలు రకాల మొక్కలు నాటారు. కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డివిజనల్ మేనేజర్ శ్రావణి, ప్లాంటేషన్ మేనేజర్ జలపతి, డిప్యూటీ ప్లాంటేషన్ మేనేజర్ రాకేష్, విద్యార్థినులు, సిబ్బంది పాల్గొన్నారు.

చింతలమానెపల్లిలో..

చింతలమానెపల్లి: మండలంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా హరితహారం కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ మష్కూర్ అలీ, ఎంపీపీ దుబ్బుల నానయ్య పాల్గొని మొక్కలు నాటారు. మండల కేంద్రంలోని ఆయా ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామపంచాయతీల పరిధిలో కార్యక్రమం నిర్వహించారు.

బెజ్జూర్‌లో..

బెజ్జూర్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం మండల కేంద్రంలో హరితోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నాగుల్వాయి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జెడ్పీటీసీ పంద్రం పుష్పలత మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత అందిరపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మాధావీలత, ఎంపీవో రమేశ్ రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు బషారత్ ఖాన్, సర్పంచ్ కొట్రంగి శారద, బీఆర్‌ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు నరేందర్ గౌడ్, ఏపీవో చంద్రయ్య, టీఏ రవీందర్, ఎఫ్‌బీవో తిరుపతి, కార్యదర్శి తుకారాం, బీఆర్‌ఎస్ పార్టీ మండల నాయకులు జాహిద్ హుస్సేన్, సురేశ్ గౌడ్, అజీమ్‌ఖాన్, రమేశ్, మంజూర్, బిక్షమయ్య, భీమన్న, ఎఫ్ఏ దుర్గం రవి, ఐకేపీ సిబ్బంది భద్రయ్య, బెజ్జూర్ ప్రభుత్వ కళాశాల లెక్చరర్లు మండల్, జ్ఞానేశ్వర్, నాగరాజు, శారద పాల్గొన్నారు.

కెరమెరిలో..

కెరమెరి: హరితహారంతోనే పర్యావరణమని ఎంపీపీ పెందోర్ మోతిరాం, జెడ్పీటీసీ సెడ్మకి దుర్పతబాయి అన్నారు. దశాబ్ది దినోత్సవంలో భాగంగా సోమవారం నిర్వహించిన హరితోత్సవంలో పాల్గొని వారు మాట్లాడారు. అనంతరం మండలంలోని 31 గ్రామ పంచాయతీలో 2890 మొక్కలు నాటారు. ఎంపీడీవో సత్యనారాయణగౌడ్, ఎంపీవో సుదర్శన్, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, ఏపీఎం జగదీశ్వర్, ఈసీ ఐక్యానాయక్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఉన్నారు.

పెంచికల్‌పేట్‌లో..

పెంచికల్‌పేట్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో సోమవారం హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాలు, పంచాయతీ కార్యాలయాల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరిత, ఎంపీడీవో గంగాసింగ్, ఎస్సై విజయ్‌కుమార్, సర్పంచ్‌లు కావ్య, చంద్రమౌళి, ఎంపీటీసీ రాజన్న, ఏఈవో లావణ్య, హెచ్‌ఎం భానుప్రకాష్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి)లో..

సిర్పూర్(టి): మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని సీఐ సాదిక్ పాష అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని గ్రామాల్లో హరితహారం కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సిర్పూర్(టి) ఎస్సై రమేశ్ ఆధ్వర్యంలో పోలీసులు, గురుకుల పాఠశాల విద్యార్థులతో కలిసి 50 మొక్కలు నాటారు. మండల కేంద్రంలోని గొల్లవాడ కాలనీలో సిర్పూర్(టి) సర్పంచ్ తఫీమా పర్వీన్ ఆధ్వర్యంలో హరితహారం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు కిజర్‌హుస్సేన్, ఉపసర్పంచ్ తోట మహేశ్, ఎంపీటీసీ సోహెల్ అహ్మద్, ఈవో కృష్ణమూర్తి, నాయకులు ఇఫాత్‌హుస్సేన్, మౌల్కర్ సంతోష్, తిరుపతి, శ్రీకాంత్, మోహన్, శంకర్, గంట గోపాల్ పాల్గొన్నారు.

రెబ్బెనలో..

రెబ్బెన: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో సోమవారం హరిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రెబ్బెన సీఐ అల్లం నరేందర్, ఎస్సై భూమేశ్, పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాఠశాల విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో సోమవారం తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హరిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రెబ్బెన, ఇందిరానగర్, కొండపెల్లి, వంకులం గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన హరితదినోత్సవ వేడుకలకు జెడ్పీటీసీ సంతోష్, ఎంపీపీ సౌందర్యలు హాజరై మొక్కలు నాటారు. సర్పంచులు అహల్యాదేవి, వడై శాంత, రాజ్యలక్ష్మి, లలిత, పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్‌కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, వార్డు సభ్యులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు. ఏఎస్సై తిరుమల, సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

రెబ్బెన: మొక్కల సంరక్షణలో బెల్లంపల్లి ఏరియా ముందంజలో ఉందని ఏరియా జనరల్ మేనేజర్ దేవేందర్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం గోలేటిలోని ఎస్టీపీ సమీపంలో హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉద్యోగులతో కలిసి మొక్కలు నాటారు. ఇన్‌చార్జి ఎస్‌వోటూజీఎం ఉమాకాంత్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, ఏజీఎం తిరుమల్‌రావు, డీజీఎం సతీష్‌బాబు, ఉజ్వల్‌కుమార్ బెహరా, రామారావు, ఈఈ సివిల్ రాజేంద్రప్రసాద్, జూనియర్ ఫారెస్టు అధికారి నవీన్, ఎన్విరాన్‌మెంట్ అధికారి హరీశ్ పాల్గొన్నారు.

తిర్యాణిలో..

తిర్యాణి: నాటిన మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంపీపీ మర్సుకోల శ్రీదేవి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని అన్ని గ్రామాల్లో మొక్కలను నాటి హరితహారం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు గుణవంత్‌రావు ఉన్నారు.

మొక్కల సంరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత



సంపద వనాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్

కాగజ్‌నగర్‌రూరల్: ప్రతీ ఒక్కరు బాధ్యతాయుతంగా మొక్కలను సంరక్షించాలని జిల్లా అదనపు కలెక్టర్ చాహెత్ బాజ్‌పాయ్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని వంజీరి గ్రామపంచాయతీలో సంపద వనాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం సంపద వనంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో సుధీర్, అదనపు డీఆర్‌డీవో కుటుంబరావు, తహసీల్దార్ మునావర్ షరీఫ్, డీఎల్‌పీవో సురేశ్‌బాబు, ఎంపీడీవో గౌరీశంకర్, సర్పంచ్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సలీం పాల్గొన్నారు.

తాగునీటికి విద్యార్థుల తిప్పలు



నీళ్ల బాటిళ్లు తెచ్చుకుంటున్న విద్యార్థులు

బెజ్జూర్: తరగతి గదిలో కూర్చొని పాఠాలు వినాల్సిన విద్యార్థులు గొంతెండి పోతుండడంతో తరచూ ఇంటిబాట పడుతున్నారు. మండలంలోని చిన్నసిద్దాపూర్ గ్రామంలో ప్రాథమిక ఉన్నత పాఠశాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రం సైతం ఒకే భవనంలో కొనసాగుతున్నాయి. ఒక చేతిపంపు ఉన్నప్పటికీ దాదాపుగా ఆరు నెలల క్రితం చెడిపోయింది. విషయాన్ని పలుమార్లు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం తీవ్రమైన ఎండలు ఉండడంతో చిన్నారులు తాగునీటి కోసం ఇంటికి వెళ్తున్నారు. ప్రతీ 15 నిమిషాలకోసారి బాటిళ్లలో నీటిని నింపుకొని ఇంటి నుంచి బడికి, బడి నుంచి ఇంటికి వెళ్తున్నారు. దీంతో వారి చదువులు సరిగా సాగడం లేదు.

మున్నూరుకాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చింతలమానెపల్లి: మున్నూరుకాపు సంక్షేమం కోసం ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సంఘం మండల అధ్యక్షుడు బల్దారపు రాజన్న డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. సంఘం నాయకులు మాట్లాడుతూ మున్నూరుకాపు కులస్తుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. కాపు కులస్తుల కోసం ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ. 5వేల కోట్ల నిధులు ప్రతీ ఏడాది కేటాయించాలన్నారు. ప్రభుత్వం బీసీ కులాలకు అందజేస్తున్న రూ.లక్ష సహాయం పథకంలో కాపు కులస్తులను చేర్చాలని తెలిపారు. రాష్ట్రంలో 40లక్షల జనాభా ఉన్న కాపు కులస్తులను గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ ఉప్పులం మహేశ్, కాపు సంఘం నాయకులు పాల్గొన్నారు.

'తుడుందెబ్బ నాయకుల అరెస్టు అప్రజాస్వామికం'



రహదారిపై నిరసన తెలుపుతున్న ఆదివాసీలు

చింతలమానెపల్లి: ఆదివాసీలపై జరుగుతున్న దౌర్జన్యాలపై పోరాటం చేస్తున్న తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కొట్నాక విజయ్, ఆదివాసీ నాయకులు మాజీ జెడ్పీచైర్మన్ సిడాం గణపతిని పోలీసులు అరెస్టు చేయడం అప్రజాస్వామికమని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ డబ్బా గ్రామ కమిటీ అధ్యక్షుడు కుమురం నారాయణ ఆరోపించారు. సోమవారం డబ్బా గ్రామంలో తుడుందెబ్బ డబ్బా గ్రామ కమిటీ ఆధ్వర్యంలో పోలీసుల తీరుపై డబ్బా-బెజ్జూర్ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఆదివాసీలను దూషించిన అబ్దుల్ రషీద్‌ను అరెస్టు చేయాలని జిల్లా కేంద్రంలో కార్యక్రమాన్ని నిర్వహించ తలపెట్టిన ఆదివాసీ నాయకులను అరెస్టు చేయడాన్ని తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఖండిస్తున్నామన్నారు. ఆదివాసీలను కులం పేరుతో దూషించిన అబ్దుల్ రషీద్‌ను అరెస్టు చేయకుండా పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై మండిపడ్డారు. కార్యక్రమంలో తుడుందెబ్బ నాయకులు కుమురం దినేష్, కుమురం నగేష్, బుర్స శ్రీనివాస్, మహిళా నాయకులు కుమురం పద్మ, కుమురం లక్ష్మి, మండిగ లక్ష్మి, ఆత్రం సత్యక్క తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

తిర్యాణి: ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం వారు మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయం సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా నాయకుడు క్రిష్ణమాచారి మాట్లాడుతూ కార్మికులకు సంబంధించి నెలల తరబడి బిల్లులు పెండింగ్ ఉండటంతో అప్పులు చేసి విద్యార్థులకు భోజనం పెడుతున్న పరిస్థితి ఉందని, వెంటనే పెండింగ్ బిల్లులను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం మండల అధ్యక్షురాలు మడావి చంద్రకళ, కార్మికులు వెడ్మా ఊర్మిళ, కుర్సెంగ లక్ష్మి, నీలాబాయి, ఆత్రం సుశీల తదితరులు ఉన్నారు.

వానమ్మా.. రావమ్మా..!



కప్పతల్లి ఆడుతున్న అసోసియేషన్ ప్రతినిధులు

ఆసిఫాబాద్‌అర్బన్: రైతు యవ సాయం కోసం విత్తనాలు విత్తుకునే సమయం దాటి దాదాపు 15 రోజులు గడుస్తున్నా నేటికీ వరుణుడు కరుణించకపోవడంతో రైతులు అల్లాడిపోతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు పడాలని కోరుతూ సోమవారం జిల్లా కేంద్రంలో అగ్రికల్చర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కప్పతల్లి ఆట ఆడారు. కప్పతల్లి ఆడితే వర్షాలు కురుస్తాయనే సాంప్రదాయం ఉందని స్థానికులు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కవ్వాల మహేందర్, తిరుపతి, సునీల్, నరేశ్, రమేశ్, సంతోష్, ఆవిడపు ప్రణయ్, ఆనంద్, పెస్టిసైడ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ



పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మార్సీ సిబ్బంది

కెరమెరి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు సోమవారం ప్రభుత్వం మంజూరు చేసిన ఉచిత పాఠ్యపుస్తకాలను ఎంఈవో కే.సుధాకర్, ఎంఎస్‌వో ఆడే ప్రకాశ్ ఆదేశాలతో పంపిణీ చేసినట్లు సీఆర్పీల ఫయ్యాజ్ ఉరన్ రహమాన్, రాథోడ్ సంతోష్ కుమార్, సీసీవో మహేందర్ తెలిపారు. నేడు నిర్వహించనున్న విద్యా దినోత్సవంలో భాగంగా అన్ని పాఠశాలల్లో పాఠ్యా పుస్తకాలను పంపిణీ చేయాలన్నారు. 90 పాఠశాలల్లో 18378 పాఠ్య పుస్తకాలను పంపిణీ చేసినట్లు వారు తెలిపారు.

విద్యార్థినికి సన్మానం



సానికను సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

తిర్యాణి: జేఈఈ(అడ్వాన్స్‌డ్) పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి ఆల్ ఇండియా ఓబీసీ కోటాలో 2729 ర్యాంకు సాధించిన మండల కేంద్రానికి చెందిన బుర్ర సానికను సోమవారం మండల కేంద్రంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఎంపీపీ మర్సుకోల శ్రీదేవి మాట్లాడుతూ సానిక మరిన్ని విజయాలు సాధించి మండలానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్, ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ హన్మండ్ల జగదీశ్, తహసీల్దార్ అనంతరాజు, ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, ఎస్సై రమేశ్, పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, సానిక తల్లిదండ్రులు బుర్ర మధుకర్, రాజ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.

ఘనంగా భీమన్న దేవర బోనాల పండుగ



పూజలు చేస్తున్న జెడ్పీ వైస్‌చైర్మన్ కృష్ణారావు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని గువ్వలగూడ గ్రామ శివారులోని భీమన్న దేవర బోనాల పండుగను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఆదివాసీ సాంప్రదాయాల మధ్య కార్యక్రమాన్ని నిర్వహించగా, జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చీపురుశెట్టి శంకర్, మాజీ జెడ్పీటీసీ మౌల్కార్ లక్ష్మణ్, ఆదివాసీ కొలావార్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు బుర్స వెంకటేశ్, నాయకులు బండి భీమయ్య, బుర్స రంగయ్య, భీమయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ రామన్న, సర్పంచ్ పవిత్ర ధనరాజ్, వార్డు సభ్యులు దినేష్, మహావీర్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

'సమస్యలు పరిష్కరించండి'



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న నాయకులు

కెరమెరి: మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న భూ సంబంధిత సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోవ లక్ష్మి యువ సైన్యం మండలాధ్యక్షుడు కొట్రంగే శ్రీనివాస్, తదితర నాయకులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఉన్న తహసీల్దార్ జమీర్‌ను కలిసి శాలువాతో సన్మానించారు. వివిధ అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో నాయకులు పెందోర్ శ్రీనివాస్, కినక సకారాం, ఆడా రాంచందర్, సెడ్మకి బీర్‌షావ్, సెడ్మారావు, తదితరులు ఉన్నారు.